# సజీవ దృశ్యం

అది 2008వ సంవత్సరం. సెప్టెంబర్ మాసం. సాయంత్రం అయిదు గంటలు అయింది. ఆహ్లాదంగా ఉంది వాతావరణం. మేడ మీద బాల్కనీలో కేన్ ఉయ్యాలలో కూర్చుని పుస్తకం చదువుకుంటున్న కమల దృష్టి దూరంగా వస్తున్న వ్యక్తి మీద పడింది. పుస్తకం అవతల పడేసి గబగబా మెట్లు దిగి కిందికి వచ్చి వరండాలో నిలబడింది. ఆశగా చూడసాగింది ఆ వ్యక్తి వంక.

జానెడంచు పట్టుచీర కట్టుకుని, తల్లో పూలు పెట్టుకుని, చేతి రుమాలులో కుంకుమ భరిణి పట్టుకుని నడుస్తూ వచ్చిన ప్రసూన, కమల వంక చూసి పలకరింపుగా నవ్వి, ముందుకు వెళ్ళిపోయింది.

నీరుగారిపోయింది కమల. కాళ్ళీడ్చుకుంటూ లోపలికి వెళ్ళి సోఫాలో కూర్చుంది. టీవీ చూస్తున్న ప్రభాకర్ భార్య వాలకం చూసి, వాల్యూం తగ్గించి, "ఏమిటలా ఉన్నావ్" అన్నాడు.

"ప్రసూన ఈ పూట కూడా నా వంక చూస్తూ వెళ్ళిపోయింది" అంది బాధగా.

"అలాగా! వెనక్కి తిరిగి వెళ్ళేటప్పుడు వచ్చి పిలుస్తుందేమోలే" అన్నాడు ప్రభాకర్.

"ఏం వస్తుందో ఏమో! పిల్చేదైతే ఈ పాటికి పిల్చేదే. ఆ మధ్య శాంతిగారితో చెప్పిందిట, 'ఏ శుభకార్యం తలపెట్టినా చాలామంది ఆపుతున్నారు. మాకు భారం అయిపోతోంది' అందిట" చెప్పింది కమల.

"ఆ మాట నిజమే. వాళ్ళు పిలవడం ఆలస్యం బంధుమిత్ర సపరివార సమేతంగా హాజరైపోతారు కదా అందరూ" అన్నాడు ప్రభాకర్.

"కిందటి వారం విజయతో అన్నదిట ప్రసూన, 'ఈసారికి క్లుప్తంగా చేసేద్దాం అన్నారు మా వారు. ముఖ్యమైన వాళ్లని మటుకు పిలుస్తాం' అని కచ్చితంగా చెప్పిందిట" అంది కమల.

"ముఖ్యమైన వారిలో మనం ఉంటామో, ఉండమో ఈ ఫంక్షన్‌తో తెలిసిపోతుంది" అన్నాడు ప్రభాకర్ శాంతంగా.

భర్త ధోరణికి చిర్రెత్తుకొచ్చింది కమలకి. "భాస్కర్రావింట్లో, రంగనాథంగారింట్లో, ఇంకా నారాయణమూర్తి గారింట్లో ఊరికి ముందే పిలిచారుట. వాళ్ళకంటే మనమే దగ్గర. అందర్నీ పిల్చి, మనని వదిలేయడం ఏమిటీ? పిలిస్తే మనం చేతులూపుకుంటూ వెళ్తున్నామా? ఘనంగా బహుమతులు ముట్టచెప్తూనే ఉన్నాం కదా! మరి వారికొచ్చిన కష్టం ఏమిటీ" అంది ఉక్రోషంగా.

చిన్నగా నవ్వాడు ప్రభాకర్.

"ఇది మరీ బావుంది. వారింట్లో శుభకార్యం. ఇష్టమైతే పిలుస్తారు. కష్టమైతే మానేస్తారు. పిలిస్తే వెళ్తాం లేకపోతే లేదు. దానికింత రభస ఎందుకు చెప్పు?" నచ్చచెప్ప చూశాడు.

బరువుగా నిట్టూర్చింది కమల. "మీరన్నది నిజమే. పిలిస్తే వెళ్ళి ఆ వేడుక కళ్ళారా చూద్దామని ఆశ. పసివాడు ముద్దులమూట కడుతున్నాడు. ఆ బూరె బుగ్గలూ వాడూ దిష్టి తగిలేలా ఉంటాడు. అందులోనూ ఈ ఫంక్షన్ కోసం పట్టు పైజామా లాల్చీ, దానిమీదికి వెల్వెట్ కోటు కుట్టించారుట. ఆ బట్టల్లో ఇంకెంత ముద్దుగా ఉంటాడో" అంది దీనంగా.

ప్రభాకర్ మొహం వాడిపోయింది. "ఎంతైనా ఆ రాజారావు అదృష్టవంతుడు" బరువుగా నిట్టూర్చాడు.

✧ ✧ ✧

వాళ్ళే కాదు, ఆ కాలనీలో చాలామంది ఆ విషయమే చర్చించుకుంటున్నారు. రాజారావు గారి ఆహ్వానం అందుకున్నవారు ఆనందంతో తలమునకలు అవుతూ ఉండగా, అందుకోని వారు ఆశతో ఎదురు చూస్తున్నారు.

ఆ కాలనీలో పంథొమ్మిది వందల డెబ్బై దశకంలో ఇళ్ళ స్థలాలు బాగా చౌగ్గా దొరికాయి.

అప్పర్ మిడిల్ క్లాసువారంతా కొనుక్కుని, ఇళ్ళు కట్టుకున్నారు.

అందరూ మంచి ఉద్యోగులే. అందరివీ పరిమిత కుటుంబాలే.

తొంభైయవ దశకం చివర్లో వైటూకే సమస్య పరిహారార్థం కొందరు, జి.ఆర్.ఇ. రాసి పై చదువుల కోసం మరికొందరు, కుర్రకారు అంతా తండోప తండాలుగా అమెరికా తరలిపోయారు.

అప్పట్లో అమెరికా వెళ్ళని అబ్బాయిని అదేదో వింత జంతువుని చూసినట్లు చూసేవారు.

ఎంత డబ్బు ఖర్చు అయినా సరే ఏ మార్గం అనుసరించి అయినా సరే ఏదో తంటాలు పడి, తల తాకట్టు పెట్టి అమెరికా పంపిస్తే, ఖర్చు పెట్టినదంతా ఆర్నెల్లలో సంపాదిస్తాడు. అందుకే అమెరికా వెళ్ళడం ఒక్కటే జీవితాశయం.

ఏ నోట విన్నా అమెరికా కబుర్లే. 'మీ వాడికి ఎంత సంపాదన అంటే, మీ వాడికి గ్రీన్ కార్డ్ దొరికిందా? మీవాడు ఇల్లు కొన్నాడా అంటే, మీవాడు ఉద్యోగం మారాడా? మా వాడు ఇన్ని డాలర్లు పంపాడంటే మావాడు అన్ని పంపాడు' ఇవే కబుర్లు. ఇదే హడావుడి.

మగపిల్లలు అలా వెళ్ళిపోతే, ఆ వెళ్ళిన మగపిల్లల్ని పెళ్ళి చేసుకుని ఆడపిల్లలు కూడా అమెరికా ఎగిరిపోయారు. అటువంటి అమెరికా ప్రభంజన కాలంలో చాదస్తం మనిషి ఒహడు సంప్రాప్తం అయ్యాడు ఆ కాలనీలో.

ఆయన పేరు రాజారావు. గవర్నమెంటు కాలేజీలో లెక్చరర్. భార్య ప్రసూన. ఇద్దరు పిల్లలు. సాగర్, సంగీత. పిల్లలు బుద్ధిమంతులు. తెలివిగలవాళ్ళు. ఇంటర్లో మంచి కోచింగ్ సెంటర్లో చేరమని చెవినిల్లు కట్టుకుని పోరినా, తండ్రీ వినిపించు కోలేదు, కొడుకూ వినిపించుకోలేదు.

ఫలితం ఎంసెట్‌లో మూడువేల పైన వచ్చింది ర్యాంకు. "సరే! అయిందేదో అయింది పేమెంట్ సీటు దొరుకుతుంది. ఇంజనీరింగ్‌లో చేర్పించు. ఇక్కడ కాకపోతే కర్నాటక పంపించు. అదీకాకపోతే మహారాష్ట్రలో చదివించు" అని చిలక్కి చెప్పినట్లు చెప్పారు.

ఆఁ హాఁ, వింటేనా మొండిఘటం. అంత డబ్బు పోసి చచ్చినా చదవనని కొడుకూ, అతనికి వంతపాడుతూ తండ్రీ. తీరాచేసి డిగ్రీలో చేర్పించాడు.

అందరూ జాలిపడ్డారు సాగర్ దుఃస్థితికి. ఉన్న ఒక్క కొడుకు చదువుకీ కాకపోతే ఎందుకట? మూటకట్టుకుపోతాడా అని విసుక్కున్నారు.

పోనీ కూతురి విషయంలో నైనా జాగ్రత్తపడ్డాడా అంటే అదీ లేదు. అన్నగారి అడుగుజాడల్లో నడుస్తూ సంగీత కూడా ఆఫ్ట్రాల్ డిగ్రీలో చేరిపోయింది.

ప్చ్... ఏమిటో కలిగి కర్మం, లేక దరిద్రం అంటే ఇదే ఇక వీళ్ళని ఆ భగవంతుడు కూడా బాగుచెయ్యలేడు అనుకుని వదిలేశారు.

తోటి వాళ్ళంతా ఏనుగంత సూట్‌కేసులు ఈడ్చుకుంటూ విమానాల్లో ప్రయాణం చేస్తుంటే, సాగర్ పిల్లికూన లాంటి సూట్‌కేస్ చంకనేసుకుని రైళ్ళలో, బస్సుల్లో ప్రయాణం చేస్తుంటే చూసి ఇరుగు పొరుగు గుండె తరుక్కుపోయేది.

చదువులైపోయాయి. డిగ్రీ, ఆ తర్వాత పోస్ట్ గ్రాడ్యుయేషన్, పన్లో పనిగా పి.హెచ్‌డి. చేసేసి యూనివర్సిటీలో ఉద్యోగంలో చేరిపోయాడు సాగర్.

పోస్ట్ గ్రాడ్యుయేషన్‌తో ఆపేసి, పి.హెచ్‌డి. తర్వాత చేసుకుంటాను అని ఓ ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్‌గా చేరిపోయింది సంగీత.

ఇకనైనా జాగ్రత్తపడి పిల్లకి అమెరికా సంబంధం చెయ్యి అని పోరారు స్నేహితులు. విన్నాడా? లేదు.

తనకు తగిన వాడినే వెతికి పట్టుకుని పిల్లలిద్దరికీ ఒకేసారి, ఒకే కళ్యాణ మండపంలో కుండమార్పిడి సంబంధం చేసేశాడు.

బాగానే ఉంది. గంతకు తగ్గ బొంత అని బుగ్గలు నొక్కుకున్నారు అందరూ. అల్లుడు శ్రీ వేంకటేశ్వరా యూనివర్సిటీలో పాఠాలు చెప్తాడు. కోడలు ట్రాన్స్‌ఫర్ చేయించుకొని వచ్చి ఇక్కడ పాఠాలు చెప్తోంది. కూతురు ఇక్కడి ఉద్యోగం వదిలేసి అక్కడ వేరే ఉద్యోగంలో చేరిపోయింది.

రిటైర్ అయ్యేనాటికి చాలినంత పెన్షన్, సొంత ఇల్లు, ఇంట్లో కొడుకు కోడలు, అనుకూలవతి అయిన భార్య దర్జాగానే ఉంది రాజారావు పని.

ఆయన ప్రాభవమే అలా ఉంటే, ఇక అమెరికా వారి సంగతి అడగాలా! వేసివేయనట్లు ఉన్నారు. కాకపోతే ఒకటే చిక్కు.

ఏదో అందరూ ఇండియాలో ఉండి, ఒకడు అమెరికా వెళ్తే గొప్పగానీ, అందరూ అమెరికా వెళ్ళినవారే అయితే గొప్పేం ఉంది? గుంపులో గోవిందా!

అలా అని గొప్పలు చెప్పుకోకపోతే ఎలా? అందుకే మనసూరుకోక యథాశక్తి గొప్పలు చెప్పుకోవడం.

“మా అబ్బాయి ఉండే ఊళ్ళో చలికాలం అంతా మంచుమయం. తెల్లారేసరికి దూదికుప్పల్లా మోకాటి లోతు మంచు. ఎంత బావుంటుందో చూడ్డానికి” అని ఒకరంటే–

“నిజమే పాపం. అదో పీడాకారం. తెల్లారి లేస్తూనే పలుగులు, పారలు పట్టుకుని ఆ మంచంతా తవ్విపోసుకోవాలిట పాపం. వెధవ చాకిరీ. మా అబ్బాయికి ఆ అవస్థ లేదు. వాడుండేది సీ కోస్ట్. లక్షణంగా ఏడాది పొడవునా ఆహ్లాదంగా ఉంటుంది వాతావరణం” అని మరొకరి సానుభూతి.

“కిందటిసారి మేము వెళ్ళినప్పుడు నయాగరా చూశాం. ఎంత బావుందో” అని ఓ ఇల్లాలు కళ్ళు విప్పార్చుకుని చెప్తే–

“భలేవారే లెండి. అసలు నయాగరా అందం చూడాలంటే కెనడా వైపు నుండి చూడాలి. మొన్న మేము వెళ్ళొచ్చాం. ఈసారి మీరూ వెళ్ళిరండి” అంటూ మరొక ఇల్లాలి సలహా.

“మా అమ్మాయి పురిటికి వెళ్తూ అన్నీ పట్టుకెళ్ళాను. దేనికీ వెతుక్కోకుండా అన్నీ పట్టుకొచ్చారు అత్తయ్యగారు అని ఆనందపడ్డాడు మా అల్లుడు” అని ఒకావిడ అంటే –

“నేనేం తీసుకెళ్ళలేదు. మా అమ్మాయి ఇంటికి దగ్గర్లో బ్రహ్మాండమైన సూపర్ మార్కెట్టుంది. శొంఠి దగ్గర నుండి వసకొమ్ము దాకా సమస్తం దొరుకుతాయి. అక్కడి నుంచి మిగిలిపోయినవి పట్టుకొచ్చి మా తోటికోడలి కూతురు పురుడుకోసం వాళ్ళకి పంపించాను” అని ఎగతాళి.

“ఆఁహాఁ! అలాగా నాకు తెలియదే! ఈసారి వెళ్తే నాకూ ఓ పావు కిలో పాత చింతకాయ పచ్చడి తెచ్చిపెట్టండి” అని మొదటావిడ ఎద్దేవా.

డబ్బు సమస్య లేదు. కాబట్టి అందరూ ఇళ్ళు మరికాస్త అందంగా రీమాడలింగ్ చేయించి, హంగులూ, అలంకారాలూ చేయించుకున్నారు. ఎన్నో రకాల చిన్న కార్లు వచ్చేశాయి. తలోకారూ కొనుక్కున్నారు. అక్కడి నుండి తెచ్చుకున్న పగడాలు, జేడ్స్‌తో నగలు చేయించేసుకున్నారు. ఇక్కడ ఉండే డబ్బు కాక అడపా దడపా పిల్లలు ఇచ్చే డాలర్లు అంతా కలిపి పుష్కలంగా డబ్బు.

చేతి నిండా డబ్బుంటే సమస్యలుండవని అనుకోవడం శుద్ధ పొరపాటు. డబ్బు దారి డబ్బుదే, సమస్యల దారి సమస్యలదే.

✧ ✧ ✧

ఇప్పుడు ఈ యన్నారైల జననీ జనకులకు కూడా సవాలక్ష సమస్యలు. వయసు మీదపడుతోంది. రక్తపోటు, మధుమేహం వంటి సాధారణ అనారోగ్యాలు. అవిగాక బైపాస్ సర్జరీలు, బెలూన్లు వదలడాలు, హిస్టిరెక్టమీలు వంటి గంభీర సమస్యలు.

ఏ అవసరం వచ్చినా ముందు మనిషి ఆసరా వెతుక్కోవాలి. అంత దూరాన ఉన్న పిల్లలు చీటికీ మాటికీ రాగలరా? వచ్చినా, వాళ్ళకి వీళ్ళు చెయ్యాలి తప్ప వీళ్ళకి వాళ్ళు చెయ్యగలరా!

డబ్బు పారేస్తే మనుషులు దొరికే కాలం పోయింది. అందరూ డబ్బు పారేయగలవాళ్ళే అవడంతో మనుషులు దొరకడం గగనం అయిపోతోంది.

కార్లైతే కొనుక్కున్నారు కానీ, పాపంలా పెరుగుతున్న ట్రాఫిక్‌లో వాహనం నడపడం అంటే కాస్త వయసు మళ్ళినవారికి కత్తి మీద సాము వంటిది. పోనీ, డ్రైవర్ని పెట్టుకుందాం అంటే, ఓ పట్టాన దొరకడు. దొరికినవాడు మాట వినడు.

అన్నీ సవ్యంగా, సజావుగా సాగినంత కాలం ఏ ఇబ్బందీ లేదు. ఎటొచ్చీ ఏదైనా అవాంతరం వస్తే పచ్చివెలక్కాయ గొంతులో పడినట్లు అవుతుంది.

ఈ కారణాల వల్ల అన్నీ ఉన్నా, ప్రతి ఇంట్లోనూ ఏదో స్తబ్ధత, జడత్వం, ఆ గంభీర వాతావరణంలో సందడీ, సంరంభంతో ఉండే ఇల్లు ఒకటి ఉంది. ఆ ఇల్లు రాజారావుది. రీ మోడలింగ్ చేయించలేదు గానీ, క్రమం తప్పకుండా సున్నాలూ, రంగులూ వేయిస్తూ ఉండడంతో కళకళ్ళాడుతూ ఉంటుంది. కేక్‌టస్‌లూ, మనీప్లాంట్‌లూ, ఇండోర్ ప్లాంట్‌లూ, తొట్లల్లో వేలాడే క్రోటన్సూ లేవు ఆ ఇంట్లో. అరటి చెట్టు, మునగచెట్టు, మామిడి, మల్లె, సన్నజాజితీగ, పారిజాతం ఉన్నాయి.

అధునాతనంగా వెలిగిపోతున్న ఆ కాలనీలో రాజారావు ఇల్లు కాస్త భిన్నంగానే ఉంటుంది. కానీ, పండిన తలలకు రంగు వేసుకుని, జుట్టు కత్తిరించుకుని, లిప్‌స్టిక్ వేసుకుని, సింథటిక్ చీరలు ధరించిన మహిళల గుంపులో– అక్కడక్కడ తెల్ల వెంట్రుకలను ముడి చుట్టుకుని, పట్టు చీర కట్టుకుని, తాంబూలం వేసుకున్న పాతకాలం మధ్య వయసు ఇల్లాలిలా అదో అందంగా ఉంటుంది.

రాజారావు పిల్లలు అమెరికా వెళ్లకపోయినా, ఆయనేం అడుక్కు తినడం లేదు. ఆయనా కారు కొనుక్కున్నాడు. నలుగురు పిల్లలకీ (ఆ మాట ఆయనే అంటాడు. నాకు ఇద్దరు కూతుళ్ళు, ఇద్దరు కొడుకులు అని) అయిదంకెల జీతాలు.

కుటుంబం యావత్తూ ఉపాధ్యాయ వృత్తిలో ఉండడం వల్ల కావలసినన్ని సెలవులు.

కొడుకూ కోడలూ ఇంట్లోనే ఉన్నారు. చీమ చిటుక్కుమంటే కూతురూ అల్లుడూ తిరుపతిలో రైలెక్కి తెల్లారేసరికి దిగుతారు. లేదూ వీళ్ళే పోతారు పొలోమంటూ. ఇండియా అంతా దాదాపు చుట్టి వచ్చారు. ఓ సెలవుల్లో రాజస్థాన్‌కెళ్ళి చుట్టబెట్టి వస్తే, మరో సెలవుల్లో కేరళ వెళ్తారు.

వరండాలో కూర్చుని పేపరు చదువుకుంటూనే ఉంటాడు. అరగంట తర్వాత ప్యాంటు షర్టు వేసుకుని వచ్చి బెల్ కొట్టి, "నాగార్జునసాగర్ గేట్లు తెరిచారుట. మా సాగర్ వెళ్దాం అన్నాడు. పని మనిషి వస్తే కాస్త చెప్పండి" అని చిటికెలో ప్రయాణం అయిపోతాడు. పండుగలూ పబ్బాలూ అందరూ కలిసి సందడిగా జరుపుకుంటారు.

నోములు, వ్రతాలు, సీమంతాలు, నామకరణాలు, భోగిపళ్ళు, బొమ్మల కొలువులు, అన్న ప్రాశనలు, అక్షరాభ్యాసాలు, పుట్టిన రోజులు, పెళ్ళి రోజులు– ఒకటేమిటీ నిత్య కళ్యాణం పచ్చతోరణం.

అమెరికా పిల్లలకి ఇవన్నీ సాధ్యం కావు కదా! ఎప్పుడో ఏడాదికి ఓసారి దర్శనం. పెళ్ళిళ్లకు కూడా ఆదివారము నాడు అరటి మొలచినది అనే వారాల పాటలాగ ఒకటో తారీఖు అబ్బాయి లాండింగ్, రెండున పెళ్ళిచూపులు, మూడోతారీఖు ఎంగేజ్‌మెంటు, పదో తారీఖు వివాహం, పన్నెండున వీసాకోసం ప్రయత్నం, పదిహేనో తారీఖున సీ ఆఫ్!

✧ ✧ ✧

ఆ తర్వాత వాళ్ళు ఏ ఫంక్షన్ చేసుకున్నా మూడోనాటికి సీ.డీ. వచ్చి ఒళ్ళో వాల్తుంది.

కేకు కోయడం, పాటలు పాడడం, ముద్దులు పెట్టుకోవడం కళ్ళముందు యథాతథంగా కనబడుతుంది. కాకపోతే అందులో జీవం ఉండదు.

కన్నబిడ్డల్ని అభిమాన నాయకుడిలా తెరమీద చూసుకుని ఆనందించడం సాధ్యం కాదు కనుక మనసు చివుక్కుమంటుంది.

అందుకే రాజారావింట్లో వేడుక అంటే అందరికీ పరమానందం. ఒక్కటీ మానకుండా అందరూ వెళ్తారు. బోసినవ్వుల పసిబిడ్డల్ని ఎత్తుకుని తమ మనవల్తో ఆడుకున్నంత ఆనందిస్తారు. నాన్నా నాన్నా అంటూ వెంట తిరిగే సాగర్‌లో తమ బిడ్డని వెతుక్కుని తృప్తిపడతారు. వదినా మరదళ్ళ హాస్యాలూ, బావమరుదుల పరాచకాలు చూసి ముసి ముసి నవ్వులు నవ్వుకుంటారు.

అక్కడున్నంతసేపూ సర్వం మరిచిపోయి ఆనందపరవశులవుతారు. ఆ సజీవ దృశ్యం చూడడం కోసం చకోర పక్షుల్లా కాచుకుని ఉంటారు. రాన్రాను జనం పెరిగిపోతున్నారు కాబట్టి ఇక మీదట వేడుకలు క్లుప్తంగా చేద్దాం అని రాజారావు ఆలోచిస్తున్నాడని విన్నదగ్గర్నుండి అందరి గుండెల్లో రాయి పడింది.

రాజారావు మనవడి పుట్టినరోజు ఆహ్వానం అందుతుందనే ఆశతో, అందదేమో అనే భయంతో సతమతం అవుతున్నారు. వారి ఆరాటం సహజమే. తమకు అందని దాని కోసం అదెంత చిన్నదే అయినా ఆరాటపడడం మానవ నైజం కదా!

చైతన్యస్రవంతిలా సాగిపోతున్న ఆ ఇంట్లో ఆ వ్యక్తుల మధ్య కాస్త సమయం గడిపితే ఆ తీపి జ్ఞాపకాలతో కొన్నాళ్ళు కాలక్షేపం చెయ్యొచ్చు. పాపం వారికి కలిగిన ఆ చిన్న కోరిక తీరుతుందా?

*ఇండియా టుడే వారపత్రిక – 10 అక్టోబర్, 2000*